మోడల్ వైపు విద్యార్థుల మొగ్గు

- టెన్త్‌లో జిల్లా టాపర్ మోడల్ పాఠశాల విద్యార్థే..
- నాడు – నేడు పనులతో సకల సదుపాయాలు
- ప్రవేశాలకు విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి



భోగాపురం మోడల్ స్కూల్

పూసపాటిరేగ : భోగాపురం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నాడు – నేడు పనులతో సకల సదుపాయాలు సమకూరాయి. దీంతో విద్యార్థులు చదివేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇదే సమయంలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఇదే పాఠశాలకు చెందిన కొయ్య హరీష్ 593 మార్కులతో జిల్లాలో టాపర్‌గా నిలిచాడు. దీంతో ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఎక్కడో దూరాన ఉన్న పాఠశాలలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోయే కంటే ఉత్తమ ఫలితాలతో పాటు సకల సదుపాయాలు ఉన్న ఈ పాఠశాలలోనే చేరడం ఉత్తమమని తల్లిదండ్రులు భావిస్తుండడంతో పోటీ పెరిగింది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో కూడా మారుమూల తీర ప్రాంతం ముక్కాంకు చెందిన మత్స్యకార విద్యార్థి మైలపల్లి దేవేంద్ర 973 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 96 శాతం ఫలితాలు సాధించి భోగాపురం మోడల్ పాఠశాల రికార్డులకెక్కింది.

నాడు – నేడుతో మారిన రూపురేఖలు

భోగాపురం మోడల్ పాఠశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులతో రూపురేఖలు మారిపోయాయి. గతంలో మౌలిక సదుపాయాలు సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు చదవడానికి ఆసక్తి చూపించేవారు కాదు. నాడు – నేడు నిధులతో మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, గార్డెన్, జాతీయ రహదారి నుంచి పాఠశాలకు సీసీ రహదారి వంటి పనులు చేయడంతో పాఠశాలకు అన్ని సౌకర్యాలు సమకూరాయి. పాఠశాలలో మంచి ఫలితాలు సాధనే ధ్యేయంగా సిబ్బంది పని చేయడం, మంచి ఫలితాలు సాధించడంతో ఈ పాఠశాలలో సీటు కోసం తల్లిదండ్రులు, పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు.


గోడలపై జాతీయ నాయకుల చిత్రాలు

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం



పాఠశాలలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం. అంకితభావంతో పని చేయడం, విద్యార్థులను మంచి క్రమశిక్షణలో వుంచడానికి ఉపాధ్యాయులు తోడ్పాటు అందిస్తున్నారు. పాఠశాలకు ఒక్క రోజు విద్యార్థి గైర్హాజరైనా తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాధానం తీసుకుంటున్నాం. శతశాతం ఫలితాలు సాధనకు కృషి చేస్తున్నారు.

– సి.పార్వతి, భోగాపురం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

క్లుప్తంగా

చిన్నారులకు నాణ్యమైన విద్య అందించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పునరుత్పత్తి ఆరోగ్యం, బాల్య వివాహాలు వలన కలిగే దుష్ప్రభావాలు, కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యవతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

విజయనగరం ఫోర్ట్: కిశోరి బాలికల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.ఎర్రయ్యమ్మ అన్నారు. స్థానిక జొన్నగుడ్డి ఏరియాలో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమంలో శుక్రవారం ఆమె పాల్గొని మాట్లాడారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా చూసుకోవాలన్నారు. పప్పు దినుసులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు తీసుకోవాలన్నారు. డీసీపీయూ విభాగం ప్రతినిధి బి.రామకోటి, వైసీపీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రుఖాన్సీ ఎంఎస్‌కే భార్గవి, ఏఎన్‌ఎం లలిత తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమ ప్రవాహిని ర్యాలీ


సత్యసాయి రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విజయనగరం టౌన్: పుట్టపర్తి నుంచి జిల్లాకు వచ్చిన శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథానికి ఉడా కాలనీలో భక్తులు బ్రహ్మరథం పట్టారు. సత్యసాయి శత జయంతి కార్యక్రమాల్లో భాగంగా వచ్చిన రథానికి బొబ్బాదిపేట సత్యసాయి సంకల్ప మందిరం వద్ద మహిళలు అధిక సంఖ్యలో పూర్ణ కలశాలతో సాదర స్వాగతం పలికారు. 4 గంటలకు పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. బాలవికాస్ విద్యార్థులతో కోలాటం, భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రథో, కన్వీనర్ నడిపిల్లి రమణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా దాబాలు నిర్వహిస్తే చర్యలు

నెల్లిమర్ల రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా దాబాలు, హోటళ్లు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. మండలంలోని సతివాడలో అక్రమంగా నిర్వహిస్తున్న దాబాలపై గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. అల్తిపాలెం, సతివాడ జంక్షన్లలో ఉన్న రెండు హోటళ్లలో మద్యం సేవిస్తున్న 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. అర్ధరాత్రి దాటిన వరకు అనుమతులు లేకుండా హోటళ్లు నిర్వహించడం సరికాదన్నారు. ఇదే ప్రక్రియను కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ మెటీరియల్ వితరణ

విజయనగరం టౌన్: సామాజిక కార్యకర్త, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్ పుట్టినరోజు సందర్భంగా తన మిత్రుల సహకారంతో రూ. 10వేలు విలువ చేసే డీఎస్సీ మెటీరియల్‌ను గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వితరణ చేశారు. ఈ మేరకు శుక్రవారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మికి మిత్రులు, సంఘ సభ్యులతో కలిసి పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు నాలుగెస్సుల రాజు, అధ్యక్షుడు కె.ఎర్నాయుడు, ఉపాధ్యక్షుడు కె.దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు బలోపేతం కావాలి

నెల్లిమర్ల రూరల్: రైతు ఉత్పత్తిదారుల సంస్థలు బలోపేతం కావాలని బ్రెడ్స్ ఎన్‌జీఓ సంస్థ సీఈఓ రామకృష్ణరాజు పిలుపునిచ్చారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో పది మండలాల ఎఫ్‌పీఓలు, అకౌంటెంట్లకు శుక్రవారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు తాము పండించే పంటలను తామే మార్కెటింగ్ చేసుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డీసీసీబీ జనరల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి రుణ సదుపాయం కావాలన్నా అందించేందుకు తమ బ్యాంక్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కోదండపాణి, డీసీసీబీ చీఫ్ మేనేజర్ స్వాతి పాల్గొన్నారు.

● ఇదేమి ప్రయాణంరా.. బాబూ...!



పెద్దలతో పాటు ముగ్గురు చిన్నారులు ప్రయాణిస్తూ చూసే వారికి భయాన్ని కలిగించారు. ఇప్పటికే రోజూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తుంటే ఈ ప్రయాణమేంటి? జరగరానిది జరిగితే ఏం కావాలి... ఒక్కసారి ఆలోచించరా...! మీరు...!! విజయనగరంలో శుక్రవారం సాక్షికి చిక్కిన ప్రమాదకర ప్రయాణమిది.

ద్విచక్ర వాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించడం నిబంధనలకు విరుద్ధం. ఇది కాస్త పక్కన పెడితే... ఈ చిత్రంలో బైక్‌పై ఇద్దరు

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రారండోయ్..వేడుక చూద్దాం..!


గ్రామ పురవీధుల్లో పర్యటిస్తున్న మహిళలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో శుక్రవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 9 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో భక్తులు, ఆలయ ప్రతినిధులు గ్రామ పురవీధుల్లో స్వామి నామాలను సంకీర్తన చేస్తూ పర్యటించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా ఇంటింటికీ వెళ్లి వేడుకలకు రావాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

రామతీర్థంలో రామానుజ, ఆదిశంకరుల జయంతి


రామస్వామి సన్నిధిలో రామానుజుల వారికి పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో భగవత్ రామానుజ స్వామి జయంతితో పాటు ఆది శంకరుల జయంతిని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం స్వామి సన్నిధిలో నిత్య కల్యాణం వేడుకగా నిర్వహించి, శ్రీరామానుజ ఆచార్య స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకం జరిపించారు. ఆలయ క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో శ్రీ శంకరాచార్య జయంతి కనుల పండువగా జరిగింది. స్వామికి పంచామృత అభిషేకం, అర్చనలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వై.శ్రీనివాసరావు, అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాద్ రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో వార్డు పర్యటన


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కమిషనర్

విజయనగరం: వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు 24వ డివిజన్‌లో పర్యటించారు. వార్డు పరిధిలోని కొత్తాగ్రహారం ప్రాంతంలో సిబ్బందితో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా వీధి దీపాలు, కాలువల సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అక్కడక్కడ చెత్తాచెదరాలు నిల్వ ఉండడాన్ని గమనించి వెంటనే వాటిని శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ డాక్టర్ బి.అంబేడ్కర్ ఆదేశాలతో ప్రతి వారం వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తున్నామన్నారు. సంపూర్ణ పారిశుధ్య విధానంలో ప్రజా సహకారం కూడా అత్యంత అవసరమని చెప్పారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించకుండా పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. ఈ పర్యటనలో ఏఈ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో ఆదిశంకరాచార్య జయంతి


ఆదిశంకరాచార్య జయంతి ఉత్సవాలలో పాల్గొన్న వేద విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మఠంవీధి శంకర మఠంలో అద్వైతసభ ఆధ్వర్యంలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గత ఐదు రోజులుగా నిర్వహిస్తున ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆలయ అర్చకులు పాకల సూర్యనారాయణ శర్మ నిర్వహించారు. వేదపండితులు వేదపఠనాలు నిర్వహించారు. అనంతరం శంకరమఠం అధ్యక్షుడు జిఎస్.నరసింహం పర్యవేక్షణలో స్వామివారిని ప్రత్యేక పల్లకీపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రాతా రాజేశ్వర శర్మ, వేదపండితులు రాళ్లపల్లి రామసుబ్బారావు, రాంభట్ల సన్యాసిరాజు, శీలా నానాజీ శర్మ, దశగ్రంథాల సుబ్రహ్మణ్య శర్మ, వేదవిద్యార్థులు, సభ్యులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం 20న సమ్మె

విజయనగరం గంటస్తంభం: మే 20న తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతలు కోరారు. సమ్మెకు సంబంధించి కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం అమర్‌భవన్‌లో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కార్ కరోనా సమయంలో చర్చ లేకుండా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు దేశంలోని యావత్ కార్మిక వర్గం ఈ నెల 20న సమ్మె చేయడం ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మె ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతనం ధరలకు అనుగుణంగా రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తుందన్నారు. కార్పొరేట్లకు అనుగుణంగా మోదీ ప్రభుత్వం తన విధానాలను కొనసాగిస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

10 వరకు కిశోరి వికాసం వేసవి శిబిరాలు


సచివాలయంలో కిశోరి వికాసం కమిటీ సమావేశం

విజయనగరం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో కిశోరి వికాసం వేసవి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మంగళ, శుక్రవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో మే నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ శిబిరాలు జరగనున్నాయని కమిషనర్ నల్లనయ్య పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా ముందుగా కమిటీల ఏర్పాటు జరిగిందన్నారు. వీటిలో ఐసీడీఎస్, మెప్మా, సచివాలయ సిబ్బంది సమన్వయంతో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల పరిచయం అనంతరం కిశోరి బాలికలు వారి తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించారు. బాలికల సంరక్షణ, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలను వివరించారు.

జాప్యం లేకుండా మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి


పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

విజయనగరం అర్బన్: బదిలీలకు అవసరమైన ప్రిఫెరెన్షియల్ క్యాటగిరి టీచర్ల మెడికల్ చెకప్, సర్టిఫికెట్లను జాప్యం లేకుండా సకాలంలో మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఎస్‌టీయూ ప్రతినిధులు ఈ మేరకు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ముఖ్యంగా ఈఎన్‌టీకి సంబంధించి ఉపాధ్యాయుల చెకప్స్ ఇంతవరకు పూర్తి కాలేదని తెలియజేశారు. త్వరితగతిన పూర్తి చేసి సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. సూపరింటెండెంట్ స్పందిస్తూ ఇప్పటికే చెకప్ పూర్తయిన మెడికల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యా శాఖ ద్వారా మండల విద్యాశాఖ అధికారులకు పంపించారని తెలిపారు. సూపరింటెండెంట్‌ని కలిసిన వారిలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం, జిల్లా నాయకులు శ్రీనివాసదొర, ఎం.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు సిద్ధం


వాసవీమాత జయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నారాయణం శ్రీనివాస్, తదితరులు

విజయనగరం టౌన్: వైశాఖ మాస శుక్లపక్ష దశమి శ్రీ వాసవీ కన్యకపరమేశ్వరీ అమ్మవారి జయంతి పురస్కరించుకుని రెండు రోజుల పాటూ నిర్వహించే ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో ఉన్న కార్యాలయంలో ఉత్సవాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 108 మంది దంపతులతో అష్టోత్తర శతకలశ ప్రదర్శన ఉంటుందన్నారు. 7న బుధవారం అమ్మవారు బంగారు చీర, వజ్ర కిరీటంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. దేవాలయం అభివృద్ధిలో భాగంగా దేశంలో మొట్టమొదటిసారిగా వాసవీమాత జీవిత చరిత్రకు సంబంధించిన 25 ఘట్టాలను హైదరాబాద్‌కి చెందిన శిల్పులతో ఆకర్షణీయంగా రూపొందించామన్నారు. దేవాలయం గౌరవాధ్యక్షుడు కోలగట్ల వీరభద్రస్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాపుగంటి ప్రకాష్ మాట్లాడుతూ 130 ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయం సుందరీకరించడంలో సభ్యుల కృషి ఎనలేనిదన్నారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి ఉమామహేశ్వరరావు, పాలకమండలి సభ్యులు మురుగన్, వెత్సాసత్యనారాయణమూర్తి, వెంకటరావు, జనార్దనరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతల్లేవు..

సాక్షి ఎఫెక్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎటువంటి అనధికార విద్యుత్ కోతలు విధించడం లేదని ఆ శాఖ ఏఈ పిచ్చయ్య తెలిపారు. మరమ్మతుల పేరిట తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో 'కోతల్లో ఇదో రకమా'..! అనే శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరాలో భాగంగా లైన్ల నిర్వహణ నిమిత్తం సబ్‌స్టేషన్ల వారీగా సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. త్వరలో మరమ్మతుల పనులు పూర్తి చేసి నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేస్తామన్నారు. ఎటువంటి అనధికార కోతలు లేవని, 24 గంటల విద్యుత్ సరఫరాను చేస్తున్నామని చెప్పారు. గృహాలకు, వ్యవసాయ క్షేత్రాల సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వమిచ్చే రుణాలకు షరతులు తగ్గించాలి


ప్లకార్డుల ద్వారా సమస్యల ప్రదర్శన

విజయనగరం టౌన్: వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా ఇచ్చే రుణాలకు షరతులు తగ్గించాలని నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయి బ్రాహ్మణులు అనేక ఇబ్బందులతో బాధపడుతున్నారని, వారికి ప్రభుత్వమందించే రుణాలు సిబిల్ స్కోర్ పేరుతో బ్యాంకులో నిరాకరిస్తున్నాయన్నారు. వృత్తిదారులు ప్రైవేట్ ఫైనాన్స్ ఆన్‌లైన్ ఫైనాన్స్‌లు గోల్డ్‌లోన్‌లు తీసుకుని ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని విశ్వకర్మ ద్వారా అందిస్తామన్న రుణాలు అందరికీ అందడం లేదన్నారు. శిక్షణ పొందిన వారికి ఇస్తామన్న రూ.లక్ష నుంచి మూడు లక్షల వరకూ రుణాలు అందడం లేదన్నారు. స్టైఫండ్, టూల్ కిట్స్ కూడా ఇవ్వలేదని వెంటనే ఇవ్వాలని కోరారు. ముద్ర రుణాలకు ఎలాంటి ష్యూరిటీ లేకపోయినా బ్యాంక్ పొదుపు గ్రూపుల వారికి ఇస్తామని చెప్పి ప్రభుత్వ లక్ష్యాన్ని గండికొడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అందరికీ రుణాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ రుణాల అన్నింటికీ షరతులు తగ్గించి అర్హులైన అందరికీ ఇవ్వాలని కోరారు. సమావేశంలో సత్యనారాయణ సన్నిబాబు, త్రినాథ్, సంతోష్, వినయ్‌బాబు, ఎస్‌కె.బాషా తదితరులు పాల్గొన్నారు.

పాలక వర్గమే సుప్రీం

- కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ తారక్‌నాథ్

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పాలకవర్గమే సుప్రీం అని.. ఏ నిర్ణయం తీసుకున్నా సమాచారం ఇవ్వాలని సభ్యులు కమిషనర్ ఎ.తారక్‌నాథ్‌పై ధ్వజమెత్తారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిలర్లు, నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ తీరుపై విరుచుకుపడ్డారు. కమిషనర్ కౌన్సిల్ దృష్టిలో పెట్టకుండా కాలువలపై ఆక్రమణలు తొలగిస్తామని ఏ విధంగా విలేకరుల సమావేశంలో తెలియజేస్తారని ప్రశ్నించారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన కౌన్సిలర్లు దృష్టిలో పెట్టకుండా కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవచ్చా.. అని ప్రశ్నించారు. నగర పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని హితవు పలికారు. పారిశుధ్య పనులకు తాము వ్యతిరేకం కాదని, కాలువపై ఆక్రమణల తొలగింపు కష్టతరమైందని చెప్పారు. నగర పంచాయతీలో తాగునీరు లేక అల్లాడిపోతున్నారని ముందు ఈ సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ బూర సుజాత, నాయకుల చిక్కాల రవి కుమార్ నిలదీశారు.

కమిషనర్ యూటర్న్

నగర పంచాయతీలో ప్రధాన కాలువపై ఆక్రమణల తొలగింపుపై కమిషనర్ ఎ.తారక్‌నాథ్ యూటర్న్ తీసుకున్నారు. కాలువపై ఆక్రమణలు తొలగిస్తామని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిషనర్ తెలియజేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కౌన్సిల్ దృష్టిలో పెట్టకుండా ఆక్రమణలు ఎలా తొలగిస్తారని కౌన్సిలర్లు ప్రశ్నించడంతో కమిషనర్ మాట మార్చారు. ఆక్రమణలు తొలగించబోమని, కేవలం కాలువలపై పలకలు తీసి పూడికలు తీస్తామని కమిషనర్ చెప్పారు. పలకలు డామేజ్ కాకుండా అమర్చుతామని తెలిపారు. నగర పంచాయతీలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. కౌన్సిలర్లు లేవనెత్తిన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో చైర్‌పర్సన్ బంగారు సరోజినితో పాటు కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, కింతాడ కళావతి, చిక్కాల సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్య చర్యలు


చెట్టు కొమ్మలను జేసీబీ సహాయంతో తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాల్లో కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను, గురువారం రాత్రి కురిసిన వర్షానికి కూలిన చెట్లను జేసీబీల సహాయంతో ప్రజారోగ్య సిబ్బంది శుక్రవారం శుభ్రం చేశారు. కాలువల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో వర్షపు నీరు రహదారులపై ప్రవహిస్తుండటతో వెంటనే పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదిక చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో ఉదయం నుంచి ప్రత్యేక పారిశుధ్య సిబ్బంది ప్రధాన కాలువలతో పాటు చిన్న చిన్న కాలువలను కూడా పరిశుభ్ర పరిచేందుకు చర్యలు చేపట్టారు. పెద్ద కాలువలలో జేసీబీలు, బాబ్ కార్ట్‌ల సహాయంతో చెత్తను తొలగించగా, చిన్న చిన్న కాలువల్లో ప్రత్యేక పారిశుధ్య బృందాలు చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ కాలువల్లో చెత్తాచెదారాలను వేయడం వల్ల అధిక మొత్తంలో చెత్త పేరుకుపోయి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డస్ట్ బిన్లు వినియోగించుకుని కాలువలలో చెత్తలు పేరుకుపోకుండా చూడాలన్నారు.

వేడుకగా 'సకల కార్మికుల కళా' సందడి


సాంస్కృతిక ప్రదర్శనలో గాజులరేగ జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థినిలు

విజయనగరం అర్బన్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీలో హోమ్‌లో గురువారం జరిగిన 'సకల కార్మికుల కళా' సందడి వేడుకగా జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గాజులరేగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల కోలాటం, భరతనాట్యం వంటి నృత్య ప్రదర్శనలు, ఎస్.సింహాచలం ఈల పాట అలరించాయి. ప్రముఖ రంగస్థల, సినీ కళాకారుడు దాసరి తిరుపతినాయుడు, వి.నారాయణమూర్తి, డప్పు శ్రీను విప్లవ గేయాలు ఆలోచింపజేశాయి. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో సంధానకర్తగా వై.శ్రీనివాసరావు వ్యవహరించగా, దవల సర్వేశ్వరరావు, కేఎస్‌చలం, రాజు, గీత స్రవంతి, ఖైరునిసా, లతా మంగేష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు పాల్గొన్నారు.